క్లుప్తంగా

పోలమాంబ ఆలయ ఈవోగా రాజగోపాలరెడ్డి



పోలమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న నూతన ఈవో రాజగోపాలరెడ్డి

తగరపువలస: సంగివలస పోలమాంబ (కొత్తమ్మ వారి) దేవస్థానం ఈవోగా టి.రాజగోపాలరెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన నగరంలోని జగన్నాథస్వామి ఆలయం, ఇసుక కొండ రమాసత్యనారాయణ స్వామి ఆలయాలకు ఈవోగా వ్యవహరిస్తుండగా సంగివలస ఆలయ బాధ్యతలను అదనంగా అప్పగించారు. ఆయనకు ఆలయ సిబ్బంది కోరాడ శ్రీను, అర్చకులు వి.నరసింహమూర్తి, ఏడిద రామకృష్ణశర్మ స్వాగతం పలికారు.

చట్టంలో ప్రతీ అంశం క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలి



మాట్లాడుతున్న సత్యనారాయణరావు

కొమ్మాది: విద్యార్థులు పద్ధతి ప్రకారం చట్టాలను అర్థం చేసుకోవాలని విజయనగరం పోలీసు శిక్షణ కళాశాలకు చెందిన పోలీసు అధికారి కె.సత్యనారాయణరావు సూచించారు. ప్రతి విద్యార్థి నూతన చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. గీతంలో న్యాయ విద్యార్థులకు నూతన చట్టాలపై గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చట్టంలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలని, అవసరమైన సమయంలో ప్రజలకు న్యాయం అందించాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ లా ఇన్‌చార్జి డైరెక్టర్ డా. సీహెచ్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

పీఎం పాలెం: పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఇంటి వద్ద మద్యం విక్రయిస్తున్న మహిళను స్థానిక పోలీసులు అరెస్ట్ చేసి, 28 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి స్థానిక సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మధురవాడ డాక్‌యార్డు కాలనీలో ఓ మహిళ అక్రమంగా మద్యం విక్రయిస్తోందన్న సమాచారంతో స్థానిక ఎస్‌ఐ ఎస్.సునీత సిబ్బందితో దాడి చేశారు. మద్యం విక్రయిస్తున్న కె.జయలక్ష్మి అనే మహిళను అదుపులోకి తీసుకుని, వివిధ బ్రాండ్లకు చెందిన 28 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఉచిత ఇసుక అమలులో విఫలం




ఇసుక ర్యాంప్ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

భీమునిపట్నం: ఉచిత ఇసుకను అందిస్తామని ప్రకటించి, అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వంద రోజులు దాటిపోతున్నా, దానిని అమలు చేయడంలో విఫలమైందని జోన్ సీపీఎం కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్.మూర్తి అన్నారు. ఇప్పుడు ఇసుక కూడా దొరక్కపోవడంతో భవన నిర్మాణ యజమానులు ఇబ్బంది పడుతున్నారని, కార్మికులు రోడ్డున పడ్డారని పేర్కొన్నారు. స్థానిక ఇసుక ర్యాంప్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో ఆయన మాట్లాడారు. ఇప్పుడు ఇసుక మాఫియా దందా జరుగుతోందని, వారు బ్లాక్‌లో ఇష్టానుసారం అధిక రేట్లకు ఇసుక అమ్మకాలను చేస్తుండడం వల్ల మరింత కష్టంగా ఉందని అన్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి ఇసుక అందేవిధంగా చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రవ్వ నర్సింగరావు, ఎస్.అప్పలనాయుడు, కె.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ప్రణవ రూపిణి.. శక్తి స్వరూపిణి

ఓంకార రూపిణి, శక్తి స్వరూపిణి కనకదుర్గాదేవి గురువారం బాలాత్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి మహోత్సవాల ప్రారంభవేళ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మండపాల్లో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. హోమాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. మాలధారణ చేసిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



తాటితూరు రెడ్డివీధిలో..



విశేష అలంకరణలో టైలర్స్ కాలనీ విజయదుర్గదేవి



బైపాస్‌రోడ్డులోని విజయదుర్గ ఆలయంలో..



చిప్పాడ మండపంలో..

తగరపువలస: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం కనులపండువగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల తొలి రోజు అమ్మవారు బాలాత్రిపురసుందరీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. వేలాది మంది భక్తులు భవానీమాలలు ధరించి దీక్ష చేపట్టారు. సంగివలస ముగ్గురు అమ్మవార్ల ఆలయంతో పాటు బైపాస్ రోడ్డులోని విజయదుర్గ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు. భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీ కీటిన్‌పేటలోని శ్రీవిద్యా శక్తిపీఠంలో సోమయాజుల కల్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. తాటితూరు పంచాయతీలో శాలివాహన యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో 30వ సంవత్సరపు శ్రీసరస్వతీ దేవి నవరాత్రులను ప్రారంభించారు. ఇక్కడ ఈ నెల 9న అన్నదానం చేయనున్నారు. చిప్పాడలో 27వ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇక్కడ ఈ నెల 6న అన్నదానం చేయనున్నారు.

కొమ్మాది: గుడ్లవానిపాలెం యూత్ ఆధ్వర్యంలో దసరాఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి.

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురం, కృష్ణాపురం కాలనీ, మద్ది, కోరాడ, వెంకటాపురం గ్రామాల్లో దుర్గాదేవి విగ్రహాలను నిలిపి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. మద్దిలో దుర్గాదేవి విగ్రహం వద్ద ఎంపీపీ కంటుబోతు రాంబాబు పూజలు చేశారు. కనకల రంగయ్య, బుగత ఎర్నాయుడు పాల్గొన్నారు.

దుర్గాలమ్మకు పల్లకిసేవ

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయంలో అమ్మవారికి పల్లకి సేవ నిర్వహించారు. విశేష పూజలు, పంచామృత, సుగంధ ద్రవ్యాభిషేకాలు నిర్వహించారు. మధురవాడ టైలర్స్ కాలనీ విజయ దుర్గాదేవి ఆలయంలో ధర్మకర్త బంగారు లక్ష్మి, ధర్మకర్త మండలి సభ్యులు బంగారు అశోక్, రూనీస్ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు పిల్లా సూరిబాబు, నాగోతి తాతారావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- ఐటీ సెజ్ జంక్షన్ మానం ఆంజనేయులు నగర్‌లోని లలిత సుందరి సమేత మహాకామేశ్వరస్వామి దేవాలయంలో ఉత్సవాలను కలశ స్థాపన చేసి ప్రారంభించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బొడ్డేపల్లి సురేష్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

అమ్మవారికి సహస్ర కుంకుమార్చన

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని కృష్ణా కాలనీ కొండపైనున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పద్మావతి అమ్మవారిని బాల త్రిపుర సుందరిగా అలంకరించి, పూజలు చేశారు. ప్రతిరోజు ప్రత్యేక పూజలు, భక్తులకు నారాయణ సేవ ఉంటాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు తెలిపారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

- పీఎం పాలెం: గాయత్రీనగర్ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో నెలకొల్పిన దుర్గామాత మండపం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు డాక్టర్ గాదె రోశిరెడ్డి, జామి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



కీతిన్‌పేట శ్రీవిద్యా శక్తిపీఠంలో..



సహస్ర కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు



గుడ్లవానిపాలెంలో కొలువైన దుర్గాదేవి



తాటితూరు శాలివాహన యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో..



మద్దిలో నిలిపిన దేవి విగ్రహం వద్ద పూజలు



లలిత సుందరి సమేత మహా కామేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న మహిళలు

పారా స్టేడియం కోసం స్థల పరిశీలన

మధురవాడ: బక్కన్నపాలెం దివ్యాంగులు, వయో వృద్ధుల శిక్షణ సంస్థ మరియు ఉత్పత్తి కేంద్రం భూముల్లో పారా స్టేడియం ఏర్పాటుకు జేసీ మయూర్ అశోక్ స్థల పరిశీలన చేశారు. ఏ ప్రాంతంలో ఎంత భూమి ఉంది, విస్తీర్ణం, హద్దులు పరిశీలించారు. సుమారు 25 ఎకరాల మేర ఉన్న ఈ భూముల్లో దివ్యాంగుల క్రీడల కోసం స్టేడియం నిర్మాణం నిమిత్తం స్థలం పరిశీలన చేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ మాధవి పాల్గొన్నారు. రెవెన్యూ అధికారులు ఈ పర్యటన వివరాలు గోప్యంగా ఉంచారు.

వైద్యానికి రూ.29వేల సాయం

తగరపువలస: ఓన్లీ ఫౌండేషన్ అనకాపల్లి జిల్లా హరిపాలెం మండలం పాపయ్యపాలేనికి చెందిన లోవరాజు, రామలక్ష్మి దంపతులకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.29వేలు అందించింది. రామలక్ష్మి ప్రసవ సమయంలో హైబీపీ ఉండటంతో ఆమెను ముందుగా నర్సీపట్నం, తరువాత విశాఖలోని కార్పొరేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. నెలలు నిండకుండానే తక్కువ బరువుతో కవలలు జన్మించగా వారిని వెంటిలేషన్‌పై ఉంచడానికి పెద్ద మొత్తంలో డబ్బులు అవసరమైన లోవరాజు పలువురిని సాయం కోరాడు. దీనిపై ఓన్లీ ఫౌండేషన్ దాతల సాయంతో ఈ మొత్తాన్ని వసూలు చేసి బాధిత కుటుంబానికి అందించింది.

నేడు ఉచిత వైద్య శిబిరం

భీమునిపట్నం: భీమిలిలోని ఆంధ్ర బాప్టిస్ట్ చర్చిలో వైఎంసీఏ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కార్యదర్శి ఆల్బర్ట్ సుదర్శన్ తెలిపారు. ఈ శిబిరం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నిర్వహిస్తారన్నారు. శిబిరంలో పలు విభాగాలకు చెందిన వైద్యులు పాల్గొంటారని, స్థానికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

తైక్వాండో రాష్ట్ర స్థాయి పోటీలకు 13మంది ఎంపిక

మధురవాడ: ఈ నెల 4 నుంచి 8వ తేదీ వరకు రైల్వే కోడూరులో నిర్వహించనున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు మధురవాడకు చెందిన 13మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన హర్ష, గాయత్రి, సుధీర్, శ్రీకర్, మణికంఠ, ఉదయ్, ఆదిత్య, ధనలక్ష్మి, హసిని, దీక్షిత్, నిరూప్ యాదవ్, తేజశ్రీ, రూప తదితరులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. విజేతలను కోచ్ సురేష్ అభినందించారు.

మత్స్యకారులకు బోటు ఇంజిన్ల పంపిణీ



బోటు ఇంజన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గంటా

తగరపువలస: భీమిలి మండలం పెదనాగమయ్యపాలెం పంచాయతీలో 11 మంది మత్స్యకారులకు దివీస్ లేబరేటరీ యాజమాన్యం రూ.59.40 లక్షల విలువ చేసే బోటు ఇంజిన్లను అందించింది. వాటిని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చేతుల మీదుగా గురువారం పంపిణీ చేసింది. ఇంజిన్ల పని తీరును గోస్తనినదిలో ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సంస్థ జనరల్ మేనేజర్ ఎం.ఎస్.ఎన్.రావు, సీఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, భీమిలి ఎంపీడీవో హనుమంతరావు, ఎంపీటీసీ సభ్యురాలు తోట అరుణ, యరబాల అనిల్‌ప్రసాద్, దివీస్ ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, కె.నరసింహ తదితరులు పాల్గొన్నారు.

- ఆనందపురం మండలం గంభీరంలో రూ.13.55 లక్షలతో దివీస్ ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో బిఆర్‌బి నాయుడు, తాత్రాజు అప్పారావు, పి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ



గాయత్రి ఆస్పత్రిలో పరిశీలన చేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మధురవాడ: ప్రైవేటు ఆస్పత్రుల్లో 5శాతం ఉచితంగా స్కానింగ్‌లు చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు స్పష్టం చేశారు. మారికవలసలో గాయత్రి హాస్పిటల్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో అల్ట్రా సౌండ్ స్కానింగ్ రిజిస్టర్ ఉందా, ఫారం ఎఫ్ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. అలాగే 5శాతం ఉచితంగా స్కానింగ్ చేస్తున్నారా అని ఆరా తీశారు. ఉచిత స్కానింగ్‌కు రిజిస్టర్ నిర్వహించాలన్నారు. ఆస్పత్రి నిర్వహణపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీపీఎంవో బి.ఉమాపతి, వి.నాగేశ్వరరావు, ఎంపీహెచ్‌ఈవో నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై వ్యవసాయ పరికరాలు



తాటితూరులో రైతులకు మట్టి నమూనాల గురించి వివరిస్తున్న ఏవో శివకోమలి

తగరపువలస: వ్యవసాయదారులకు రాయితీపై సాగు పరికరాలు అందించనున్నట్లు భీమిలి ఏవో బి.శివకోమలి తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా భీమిలి మండలం తాటితూరు, శింగనబంధ పంచాయతీలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 5 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులకు 50 శాతం, 5 ఎకరాలు పైబడిన రైతులకు 45 శాతం రాయితీతో సూక్ష్మసేద్యం ప్రాజెక్టు ద్వారా స్ప్రింకర్లు అందిస్తామన్నారు. అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రంలో ఆధార్‌కార్డు, పాస్ ఫొటో, 1బీ తీసుకువెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. మట్టి నమూనాల విశ్లేషణ గురించి తెలియచేశారు. మార్కెటింగ్ కమిటీ సిబ్బంది మీరాబాయి మాట్లాడుతూ రైతుబంధు పథకం ద్వారా రిజిస్ట్రేషన్ అయిన రైతులు వరి, మొక్కజొన్న పంటను 5 నెలలు యార్డులో ఉచితంగా ఉంచవచ్చన్నారు.

- ఆనందపురం మండలం కణమాం, గిడిజాల పంచాయతీలలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా డీఆర్సీ చదువుల సుబ్రహ్మణ్యం, ఏవో చావా సంధ్యా రత్నప్రభ, ప్రకృతి వ్యవసాయాధికారి శ్రీనివాస చక్రవర్తి తదితరులు రైతులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ షిణగం అప్పలరాజు, ఉద్యానవన శాఖ అసిస్టెంట్ పి.సరోజ, వి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

రాగి పంటతో అధిక ఆదాయం

పద్మనాభం: రబీలో రాగి (చోడి) పంట సాగు చేస్తే అధిక ఆదాయం వస్తుందని భీమునిపట్నం సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.విజయప్రసాద్ అన్నారు. కృష్ణాపురం, రెడ్డిపల్లి పంచాయతీ రామన్నపేట గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాగి పంటకు తక్కువ పెట్టుబడి అవుతుందన్నారు. రాగి విత్తనాలను సబ్సిడీపై సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమాల్లో ఏవో ఎంవీఎస్ చలం, మార్కెటింగ్ అధికారి మేరీ కుమారి, అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త శిరీష పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీకొని ఒకరికి గాయాలు

పీఎం పాలెం: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. భీమిలి లక్ష్మీపురానికి చెందిన కాండ్రకోట సుధీర్ కుమార్ విద్యుత్ విభాగంలో ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 1వ తేదీ సాయంత్రం 4 గంటలకు క్రికెట్ స్టేడియం వైపు నుంచి తన ద్విచక్రవాహనంపై సాంకేతిక కళాశాల రోడ్డులో వస్తుండగా, అదే రోడ్డులో ఎదురుగా బైక్‌పై వస్తున్న వ్యక్తి బలంగా ఢీకొన్నాడు. దీంతో సుధీర్‌కుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన నలుగురిపై కేసులు

పీఎం పాలెం: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి, మితిమీరిన వేగంతో పాటు చెవులు చిల్లుపడేలా శబ్దకాలుష్యానికి కారకులైన నలుగురు యువకులపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పీఎం పాలెం ట్రాఫిక్ సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. రుషికొండ ఐటీ సెజ్ కూడలిలో స్థానిక ఎస్‌ఐ భాస్కరరావు తన సిబ్బందితో ద్విచక్రవాహనాలు తనిఖీ చేస్తుండగా, భారీ శబ్దాలతో ద్విచక్రవాహనాలు నడుపుతున్న నగరానికి చెందిన ఆవల యశ్వంత్ కుమార్, టౌన్ రోడ్డు ప్రాంతానికి చెందిన గోదాబ అమర్‌నాథ్, తోట జశ్వంత్ సాయి, సైని యోగీష్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి వాహనాలు స్వాధీనం చేసుకుని, కేసులు నమోదు చేశామని సీఐ తెలిపారు.

సచివాలయంలో పుట్టినరోజా?



సచివాలయంలో ఎంపీటీసీ కోరాడ రమణ పుట్టినరోజు

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస గ్రామ సచివాలయంలో అధికారులు, టీడీపీ నాయకులు ఎంపీటీసీ సభ్యుడు కోరాడ రమణకు పుట్టినరోజు వేడుకలు, జరిపి కేక్ కట్ చేసిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. గాంధీజయంతి సందర్భంగా బుధవారం సచివాలయంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సభలో ఎంపీడీవోతో పాటు కార్యదర్శులు, వీఆర్వో, సిబ్బంది ఉండగానే ఈ వేడుకలు జరుపుకోవడం వివాదాస్పదమవుతోంది. టీడీపీ మండల అధ్యక్షుడు డి.ఎ.ఎన్.రాజు, పంచాయతీ ఉప సర్పంచ్ బి.ఎస్.ఎన్.రాజుతో పాటు పలువురు టీడీపీ నాయకులు ఇందులో పాల్గొన్నారు. గాంధీ జయంతి జరపవలసిన చోట ప్రజాప్రతినిధి పుట్టినరోజు జరపడానికి ఇదేమైనా ఫంక్షన్ హాలా అంటూ పంచాయతీ వాసులు ప్రశ్నిస్తున్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన

పద్మనాభం: హెచ్‌ఐవీపై అందరూ అవగాహన పెంపొందించుకోవాలని లింక్ వర్కర్ స్కీమ్ సీఎల్‌డబ్ల్యూ ఎం.జ్యోతి అన్నారు. హెచ్‌ఐవీ వ్యాధిపై అవగాహనలో భాగంగా రేవిడి, పాండ్రంగి గ్రామాల్లో మీకు తెలుసా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ హెచ్‌ఐవీ ఉండేవారు తమకు సమాచారం ఇవ్వాలన్నారు. చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు మణి, రమాదేవి, లక్ష్మి పాల్గొన్నారు.

వీధుల్లో అంధకారం

- జీవీఎంసీ జోన్–2 పరిధిలో వెలగని వీధిలైట్లు
- 9 వార్డుల్లో 1265 వీధి లైట్లు అవసరమన్న జెడ్సీ
- చీకట్లో ఆకతాయిల ఆగడాలు
- ప్రజల అవస్థలు



వీధిలైట్లు వెలగక అంధకారంలో గుడ్లవానిపాలెం



హైవేలో కొమ్మాది జంక్షన్ సమీపంలో వెలగని సెంట్రల్ లైటింగ్

మధురవాడ: జీవీఎంసీ జోన్–2 లోని పలు ప్రాంతాల్లో వీధిలైట్లు వెలగకపోవడంతో అంతటా అంధకారం అలముకుంటోంది. ఇది ఎక్కడో మారుమూల ప్రాంతంలో కాదు హైవేను ఆనుకుని ఉన్న సర్వీస్ రోడ్డు, సాయిరాం కాలనీ–కొమ్మాది మాస్టర్ ప్లాన్ కనెక్టింగ్ రోడ్డు, స్వతంత్రనగర్, ఉడా కాలనీ, చంద్రంపాలెం, మిథిలాపురి ఉడా కాలనీ, ఆర్‌జీకే కాలనీ, పీఎంపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్, సాంకేతిక కళాశాల, ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం పరిసర ప్రాంతాల్లోనే. వీధిలైట్లు చాలాచోట్ల వెలగడం లేదని, కొత్తవి కావాలని కూటమికి చెందిన నాయకులు, కార్పొరేటర్లే ఫిర్యాదులు ఇచ్చుకునే స్థితిలో ఉన్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

బిక్కుబిక్కుమంటూ..

నగరంలోని పలు ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులతో పాటు ఉద్యోగులు, వ్యాపారులు సాయంత్రం ఇంటికి చేరుకునే సమయం కావడంతో చీకట్లో ఇబ్బంది పడుతున్నారు. చీకటిలో ఆకతాయిల ఆగడాలు పెరిగిపోవడంతో పిల్లలు, మహిళలు బయటికి వెళ్లాలన్నా భయపడుతున్నారు. ఇక్కడ చాలా ప్రాంతాల్లో వీధిలైట్లు సక్రమంగా వెలగడం లేదని స్థానికులు అంటున్నారు.

క్యూ కడుతున్న ఫిర్యాదులు

జోన్ పరిధిలోని 9 వార్డుల్లో సుమారు 1.02కోట్లుతో 1265 వీధిలైట్లు ఏర్పాటు చేయాలని, మరో రూ. 4.18కోట్లతో 553 కొత్త విద్యుత్ స్తంభాలు, లైట్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని జోనల్ అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. సెప్టెంబర్ 20వ తేదీన 5వ వార్డు కార్పొరేటర్ హేమలత వీధి లైట్ల కోసం జీవీఎంసీ కమిషనర్‌కు వినతి పత్రం ఇవ్వగా మంగళవారం 5వ వార్డు జనసేన అధ్యక్షుడు శివ ఆధ్వర్యంలో పలువురు జోనల్ కమిషనర్‌కు విన్నవించారు. ఇక పీజీఆర్ఎస్‌లో అయితే ప్రతి సోమవారం వీధిలైట్ల కోసం ఫిర్యాదులు క్యూ కడుతున్నాయి.

ఏ వార్డుకు ఎన్ని వీధిలైట్లు అవసరమో ఉన్నతాధికారులకు నివేదించిన వివరాలివి..

వార్డు	కావలసిన వీధిలైట్లు
5	234
6	425
7	195
8	250
9	30
10	16
11	35
12	40
13	40
మొత్తం	1265

గుడ్లవానిపాలెంలో కమ్ముకున్న చీకట్లు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ దరి గుడ్లవానిపాలెంలో వీధిలైట్లు వెలగక స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెల రోజుల నుండి ఇక్కడ వీధి లైట్లు వెలగక అంధకారంలో ఉంటున్నామని, రాత్రి సమయాల్లో బయటకు రావాలంటే భయమేస్తోందని ఇక్కడి వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీధి లైట్లను మరమ్మతులు చేయాలని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు తెలిపారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో విష సర్పాలు రోడ్డుపైకి వస్తున్నాయని, వీధిలోకి రావాలంటేనే భయమేస్తోందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రమాదభరితంగా సర్వీసురోడ్లు

పీఎం పాలెం: చీకటి పడితే జాతీయ రహదారికి రెండు వైపులా ఉన్న సర్వీసు రోడ్లలో అంధకారం నెలకొంటోంది. క్రికెట్ స్టేడియం కూడలి నుంచి కొమ్మాది కూడలి వరకు సుమారు 2 కిలో మీటర్ల పొడవునా సర్వీసు రోడ్లు నిర్మించారు. ఈ మార్గంలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు అమర్చిన లైట్లలో ఒకటీ అరా తప్ప వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. వెలుతురు లేని కారణంగా రోడ్డు దాటుతున్న పాదచారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి వీధిదీపాలు వెలిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



కారుషెడ్ కూడలి నుంచి కొమ్మాది కూడలి వైపు వెళ్లే సర్వీసు రోడ్డులో ..

ఉన్నతాధికారులకు నివేదిక



జీవీఎంసీ మధురవాడ జోన్–2 పరిధిలోని 5 నుంచి 13 వరకు గల 9 వార్డుల్లో 1265 వీధిలైట్లు అవసరం ఉందని ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. వారు అనుమతి ఇచ్చిన దానిని బట్టి వీధిలైట్లు ఏర్పాటు చేస్తాం.

– పి.సింహాచలం, జెడ్సీ, జీవీఎంసీ జోన్–2